# రామా...శ్రీరామా....

వారణాసి ప్రసాదరావు

శ్రీరామ... శ్రీరామ శ్రీరామ... రామకోటి రాసుకుంటూ బయటకు కూడా ఉచ్చరిస్తోన్న రాఘవయ్య కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి! కళ్ళద్దాల్ని తీసి ఉత్తరీయం కొసతో కళ్ళను తుడుచుకున్నారు. తిరిగి తన పనికి సిద్ధం కాబోతూ ఆగారు, లోపల ఏవో మాటలు హఠాత్తుగా తీవ్రస్థాయిలోనే వినబడినందుకు.

శ్రీను భార్యను కోపగించుకుంటున్నాడులావుంది. ఆమె కూడా అందుకు తగ్గట్టే వుంది. మాటకు మాట.....!

ఈకాలం పిల్లలు....పైగా కొత్త జంట..... చిన్నగా నవ్వుకున్నారు రాఘవయ్య. "పది గంటలు దాటినా ఆ ముసలాయన పడుకోక ఇంకా గొణుగుడేమిటండీ....." గట్టిగా వినిపించడంతో రాఘవయ్య ఒక్కసారిగా నిశ్చేష్టులయ్యారు.

"మరీ అంతగా తీసెయ్యకు సునీతా. డబ్బయ్యయి దేళ్ళు పైబడిన ముసలాయన కదా. నిద్ర పట్టదు సరిగ్గా. అందుకే నిద్రొచ్చేంతవరకూ అలా భగవంతుణ్ణి ధ్యానించుకుంటూనే వుంటారు" మనవడంటున్నాడు.

"చాల్లేండి మీ సంజాయిషీ. ఆయన లైటు వేసుకుని రాసుకుంటూ, పైగా గొణుక్కుంటూ వుంటే ఆదాయనకు బాగుంటుందేమోకానీ, నా కదోలా వుంటోంది. ఏం మీకు మాత్రం...?".

"సర్లే మరీ అంత గట్టిగా మాట్లాడకు. ఆయన వింటే బాధపడతారు".

'వింటే విననీయండీ. మన బాధేమిటో కూడా తెలుస్తుంది."

"ఇంకచాలించు. మరీ బుద్ధితక్కువగా మాట్లాడుతున్నావు".

"హుఁ. బుద్ధి తక్కువ! అవున్లెండి. నాది బుద్ధి తక్కువే. అయినా మీకేం తెలుస్తుంది లెండి నా తపన. పగలంతా ఆఫీసులో వుంటారు మీరు. కనీసం రాత్రి వేళయినా భార్యగా మీదగ్గరకు చేరి మీతో మనసు విప్పి మాట్లాడుకోవాలనుకోవడం నాదే బుద్ధి తక్కువ. ఆయనకు నిద్ర వచ్చేవరకు, నేనూ నిద్ర మానుకుని మీకోసం..... మీ ముచ్చటకోసం తాపత్రయపడటం కూడా నా బుద్ధితక్కువేలెండి".

శ్రీరామా. ఒక్కసారిగా చెవులు మూసుకున్నారు రాఘవయ్య ఆ చివరి మాటలు వింటూనే.

రామచంద్రా! ఏమిటీ వింత పరిస్థితి?తనూ.... తను నిద్రరాక మేలుకుని వుంటూ రామాక్షరాల్ని లిఖించుకోవడం, వల్లించుకోవడం వారి కాటంకంగా పరిణమించిందా! అయ్యో, అది తెలుసుకోలేని తను జడుడే అయ్యాడు! రామ నామ మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ, అలౌకిక ఆనందాన్ని అనుభవిస్తున్నాడే తప్ప, వారి 'ఇహలోకాని'కి తను ప్రతిబంధకం అవుతున్నాడని తెలుసుకోలేక పోయినాడు.

రాఘవయ్య మనసు గిలగిలలాడింది. రాసుకుంటోన్న పుస్తకాన్ని మడిచి పక్కనపెట్టారు. నెమ్మదిగా నవారు మంచం నుంచి లేచి లైట్ తీసివేసారు. తీసివేసేముందు కొన్నిక్షణాలు ఆగి మరీ ఆపని చేసారు.

తిరిగి మంచాన్ని ఆశ్రయించిన రాఘవయ్య మనసంతా వెనక్కి మళ్ళింది.

ఆ రోజుల్లో అంతా ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. లంకలంతేసి కొంపలు. తన బాల్యం, యవ్వనాలు ఆ వ్యవస్థలోనే సాగిపోయినయ్! చతుర్విధ పురుషార్థాలలో తనుగానీ; తన తండ్రి తాతలు గానీ మొదటిది... చివరిదీ అయినవాటికే ప్రాధాన్యత నిచ్చారు తప్ప మధ్య రెండింటికి కాదు వాటిని తమ గృహస్థ ధర్మాల్లో ఒకటిగానే ఎంచేవారు.

అదంతా ఆనాటికే చెల్లు. ఏళ్ళు మళ్ళుతున్నకొద్దీ వ్యవస్థా ధర్మాలు మారుతున్నయ్. పోకడలే మారుతున్నయ్. దేనికయినా మార్పు అనివార్యమే అయినప్పుడు తెలిసీ తనెందుకు బాధపడాలి? తన తరాని కవి సహజమయితే ఈ తరానికిది నైజమయింది. అంతే! తను తన ఏకైక మగ సంతానం శ్రీరాముచంద్రమూర్తి వద్దనే వుండేవాడు. తన తాతలనాటి మంచువాలు పోయిన సామిదేవమ్మ ఆరోగ్యానికీ, ఎదిగే పిల్లల చదువులు, పెళ్ళిళ్ళకూ శూన్యమైనాయి తనకు నిలువ నీడలేకపోతేనేం వారికి భవిష్యత్తును చూపాడు. తన రెక్కలు ఎగరగలుగుతున్ననాడు అందరూ తనవద్దనే వుండేవారు.

తను రెక్కలుడిగిన నుండీ కొడుకు అద్దె పంచన పడివున్నాడిన్నాళ్ళూ. వాడిది కాస్త మంచి ఉద్యోగమే. మొన్న సంక్రాంతిలోనే ప్రమోషనిచ్చి, పరాయి రాష్ట్రం బదిలీచేశారు. ఆ లోనూ, ఈ లోనూ సేకరించి తన స్వగ్రామం శ్రీకాకుళంలో స్థిరపడదలచి ఇల్లు కట్టేందుకు నిర్ణయించాడు. తను కోరుకున్నదీ అదే. నాగావళి సమీరాలు తనకు సేదతీరుస్తూ వుండగే తను ఆఖరి వూపిరి విడవాలి మరి! కానీ అదేం అడ్డంకులో మరి... పునాదుల వరకూ వచ్చిన ఇల్లు అక్కడితోనే ఆగింది. ఏవో గొడవలొచ్చి, చుట్టుప్రక్కల నిర్మించేవాళ్ళంతా సంఘమయి కోర్టులకు వెళ్ళారు. తీర్పు తమ కనుకూలంగానే వస్తుందన్నాడు కొడుకు. తీర్పు వస్తే ఎన్నాళ్ళని? రెండు నెలల్లోనే పూర్తవుతుంది. వాడూ మరో రెండేళ్ళలో రిటైరు కాబోతున్నాడు. "అందరం కల్సి ఆ గూడులోనే పడివుండొచ్చు. ఈలోగా రెండో మనవడి దగ్గర వుండునాన్నా వాడెలాగూ వుండేది విజయనగరంలోనే కదా. పెద్ద మనవడూ, నేనూ పై రాష్ట్రాల్లోనే వున్నాం. మా వెంబడి తిరగలేరు మీరు" అన్నాడు కొడుకు.

అదీ నిజమే ఈ వయస్సులో బొందితో ఎన్ని లోకాలని తిరగ్గలడు? ఇక్కడ తన చిన్ననాటి స్నేహితులు ఒకరిద్దరున్నారు. అయ్య కోనేరు గట్టుమీదకు వచ్చి కలుస్తూనే వుంటారు. వాళ్ళతో చక్కని కాలక్షేపమయిపోతున్నదికూడా. తన ముసలి మనసు అంతవరకే అనుకున్నది. కానీ తన మూడోతరం మనసులను కనిపెట్టలేకపోయింది! ఆఫీసుకూ, బజారుకూ అన్నింటికీ దగ్గరని ఇక్కడ యిల్లు తీసుకున్నాడు శ్రీనివాస్. అద్దె కూడా సబబుగానే వుంది. నీళ్ళ గది. వంట గది మినహాయిస్తే మధ్య గది వాళ్ళది. తనకోసం వరండా! నాలుగిళ్ళ భాగంలా కాకుండా, దానికదే ప్రత్యేకంగా ఉన్నది. పాపం పిచ్చిపిల్ల ఏదో అసౌకర్యానికి గురి అవుతున్నట్టుందీ కొంపలో. తను కాస్త వాళ్ళకు ఏకాంతాన్నివ్వాలి. తప్పదు! నిశ్చయించుకున్న రాఘవయ్య గుండె కాస్త స్థిమితం కావడంతో అప్రయత్నంగానే నిద్రపట్టేసింది.

★ ★ ★ ★ ★

"ఒరేయ్ శ్రీనూ వేసవి వచ్చేసిందికదరా. ఉక్కపోసి అస్సలు నిద్రపట్టడంలేదు. మన గట్టుమీది గుమ్మిలేదూ.... దానిమీదకి చెరువుగాలి బలేగా వస్తోందిరా. అక్కడో క్షణం కూర్చుంటేచాలు వద్దన్నా వచ్చేస్తుంది నిద్ర." భుక్తాయాసం వచ్చి ఆగారు రాఘవయ్య.

"ఏమిటి తాతయ్యా. తాతయ్య ఏం చెప్పబోతున్నాడో చూచాయగా అర్థమైన శ్రీనివాస్ కంగారుపడిపోయాడు. అనుమానంగా ఆయనవంక చూసాడు. కొంపతీసి గతరాత్రి సునీత అన్న మాటలుగానీ వినలేదుకదా! భయపడిపోయాడు మళ్ళీ.

రాఘవయ్య తన కదేం తెలియనివాడిలా మామూలుగానే నవ్వుతూ అన్నాడు. "నీతో మొన్నటి

నుంఛి చెప్పదామనే అనుకుంటున్నాను. రాత్రి పూట అక్కడే నిద్ర తీసి వస్తే నా వంటికి బాగుంటుందిరా. అక్కడికీ – యిక్కడికీ ఎంతో దూరం లేదుకదా. ఎదురుగానే కన్పిస్తోందికూడా. నా లాంటి ముసలాళ్ళు ఓ ఇద్దరు తోడుంటారు కూడానూ".

శ్రీనివాస్ కేమనాలో తోచలేదు. అతని మనసు పీకుతోంది. అంతా తాతయ్య వినే యిలా అన్నాడేమో అని. ఓ విధంగా తాతయ్య చెప్పింది నిజమే. కానీ..... కానీ...... సందిగ్ధంలో పడింది మనసు.

"ఏరా? ఏమంటావ్?"

ఉలిక్కిపడ్డాడు శ్రీనివాస్. ఏదో అనబోయేంతలో సునీత కల్పించుకుంది. "నిజమే తాతగారూ! అక్కడి చల్లని గాలికి మీకు ప్రశాంతంగా నిద్రపడుతుంది లెండి" అంది.

"నిజమే అమ్మాయ్." చిన్నగా నవ్వుకున్నాడు రాఘవయ్య.

అంట్లు పూర్తిచేసి వెళ్ళబోతున్న పనిమనిషిని పిలిచింది సునీత.

"రంగమ్మా తాతగారి పక్క ఆ గుమ్మిమీద వేసెయ్యి. తెల్లారగట్టనే మళ్ళీ తెచ్చెయ్యాలి సుమా" అంది. "అన్నట్టు తాతగారూ ఈ వరండా ఫెన్సింగుకు బయటినుంచి తాళం వేసుకుని వెళ్ళండి. మీరు మధ్యలో వచ్చెయ్యాలనుకున్నప్పుడు తల్పా వచ్చేయ్యొచ్చు. మరో కీ ఎలాగూ మా వద్ద వుంటుంది కనక ఫర్వాలేదు. ఏమంటారు?" అంది.

మళ్ళీ చిన్నగా నవ్వుతూ తలూపాడు రాఘవయ్య అవుననన్నట్టుగా. ఆ వెంటనే తేలికయిన మనసుతో లేచాడు! ఎదురుగా గట్టుమీది గుమ్మి రమ్మని పిలుస్తున్నట్టుగా వుంది. "వెళుతున్నారా శ్రీనూ" చెప్పి నడిచారు.

వెనుకగా మనవడు భార్యని కొరకొర చూస్తున్నాడో..... అభినందిస్తున్నట్టుగా చూస్తున్నాడో గమనించలేదు రాఘవయ్య.

* * * * *

ఎదురుగా ఆవలిగట్టున ఆంజనేయస్వామివారి కోవెల. చెరువు మీదనుంచి వచ్చే చల్లని గాలి. గుమ్మిపైన అప్పుడప్పుడు పురాణ కాలక్షేపం. ఇష్టాగోష్ఠులతో హాయిగానే గడిచిపోతోంది రాఘవయ్యకు. ఆరోజు మరీ ఉక్కపోతగా వుంది. రోహిణీ కార్తె మరి! పైరగాలీ వడగాలిగానే వుంటోంది. గుమ్మి దగ్గరున్న మున్సిపాలిటీవారి ట్యూబ్‌లైట్ దివ్యంగానే వెలుగుతోంది.

నిద్రరాని రాఘవయ్యకు ఓ ఆలోచన చప్పున స్ఫురించింది! తన రామకోటి పుస్తకాన్ని తెచ్చుకుంటే కాస్త కాలక్షేపం కాదూ. అవును చక్కని కాలక్షేపమే! అనుకున్నదే తడవుగా లేచి వెళ్ళారు. ఆ వీధి దీపం ఒకటి గత పక్షం రోజులుగా నిర్జీవంగా వుంటే. వీధి చివరగా నున్న దీపం వెలుతురు క్రీనీడగా వీధంతా పరుచుకునివుంది. అలవాటువల్ల ప్రాణం కనుక తడుముకోకుండా వెళ్ళారు రాఘవయ్య.

వరండా ఫెన్సింగు ముందు తాళం తీయాలనుకున్న చేతులకు తాళం కప్ప దొరకనందుకు కొద్దిగా ఆశ్చర్యపోయారు.



# ఇ.వేమన పద్యాలు




కానలేడు నుదురు కర్ణముల్ వీపును
నెరులు కానలేడు నెత్తిమీద
దన్ను గానలేడు తత్త్వమే మెఱుగును
విశ్వదాభిరామ వినురవేమ.

## రామా..శ్రీరామా

"ఇంతవేళవరకూ వేసుకోకుండా వుండిపోయారేమిటీ పిల్లలు." అనుకుంటోన్న రాఘవయ్య గుండె ఝల్లుమంది. లోపలగా ఏవో వింత చప్పుళ్ళూ.. ... గుసగుసల్లున్నూ "ఎవరదీ...." అప్రయత్నంగా వచ్చేసిందా మాట.

లోపలినుండి జవాబు రాకపోవడంతో రాఘవయ్య మనసు కీడు శంకించింది.

ఈసారి గట్టిగా పిలిచారు.

అంతే! లోపల్నుండి ఓ రెండు మానవాకారాలు దూకుడుగా బయటికొచ్చి, ముసలాయన్ని గిరాటేసినయ్! తూలిపడ్డారు రాఘవయ్య.

పడుతూనే "దొంగ.....దొంగ" కేకలుపెట్టారు.

వీధి చివరగా ఎవరో అటకాయించబోయారు పరుగెత్తుతున్నవారిని. ఫలించలేదు. విదిలించుకుని తప్పించుకున్నారా యిద్దరూ. ఆ గలాభాకు నిద్రలేచిన చుట్టుపక్కలవాళ్ళు గబగబా వచ్చారు. ముసలాయనను లేవనెత్తారు. ఏమయింది తాతగారూ. "ఏమయిందీ" ఆదుర్దాగా అడిగారు.

"దొంగ.....దొంగ" ఆయాసంతో అగిఅగి చెప్పారు రాఘవయ్య.

కొందరు తోడుపట్టి యింట్లోనికి తీసుకునివెళ్ళి నీళ్ళిచ్చారు.

"మీ మనవడూ - అతని పెళ్ళామూ రంజనీకి సెకెండ్‌షోకు వెళ్ళారండీ" ఎవరో చెప్పారు.

"అయినా ఇదేం చోద్యం. ముసలాయన్ని వీధిలోనికి తగిలేసి రాత్రిళ్ళు తిరుగుళ్ళేమిటీ" ఓ ముత్తయిదువ మండిపడిపోయింది!

ఇంకా ఎవరో ఏమో అంటున్నారు. అంతలోగా ఎవరో థియేటరుకు వెళ్ళి వాళ్ళను పిలుచుకు వచ్చినట్టుంది.

రిక్షా దిగుతూనే "ఏమయింది తాతయ్యా!" అంటూ పరుగున వచ్చాడు శ్రీనివాస్. సునీత అదుర్తున్న గుండెతో ఇంట్లోనికి వెళ్ళింది.

రాఘవయ్య నోరు విప్పేలోగా ఒకాయన తనే అందుకుని జరిగింది వివరించి తర్వాత మెల్లగా మందలించాడు.

"దెబ్బలేం తగల్లేదుకదూ తాతయ్యా-" నొచ్చుకున్నాడు శ్రీనివాస్. "లేదురా. ముందర ఇంట్లోనివి ఏమయినా పోయినాయేమో చూడు. పిదపకాలం! శ్రీరామ... రామ" రాఘవయ్య మనస్సు ఆక్రోంచింది.

అన్నీ పరీక్షించి వచ్చిన సునీత ఉద్వేగంతో అంది "ఏవండీ. ఏవీ పోలేదండీ. హమ్మయ్య" సంతోషంతో నిట్టూర్చింది సునీత.

"తాతగారు రావడం ఓ పది నిముషాలు లేటయితే - అన్నిటికన్నీ ఊడ్చుకుపోయివుండేవాళ్ళు." మరెవరో దెప్పిపొడిచారు.

దీర్ఘంగా నిట్టూర్చారు రాఘవయ్య. "శ్రీరామ రక్ష....శీనూ... ఏమీ పోలేదంటే ఆయన రక్షరా! ఇంటి ముందున్న ఇసకదిబ్బమీద పడ్డాను. ఆ పక్కింటి పక్కనేవున్న సిమెంటు పలకమీద నయితే 'ఏం జరిగివుండేదో ఆ రాముడికే ఎరుక!" వేదాంత ధోరణిలో తనకు తానే చెప్పుకుంటోన్న రాఘవయ్యను చూస్తోన్న శ్రీనివాస్‌కు కళ్ళు చెమ్మగిల్లాయి!

"అయినా ఆ దొంగముండా వాళ్ళకీ చిన్న కొంపే దొరికిందా...." ఇంకొకరు మళ్ళా ఎత్తుకున్నారు.

"దొరకడమేమిటండీ.... అవకాశం రావాలిగానీ... తాతగారి వ్యవహారం ముందరే కనిపెట్టుకుని కాసుక్కూచున్నట్టుంది. ఈరోజు వాళ్ళకి కల్సివచ్చింది" జవాబు అందించారు వేరొకరు.

అలా విన్పిస్తూనే నెమ్మదిగా సద్దుమణిగింది! దొంగలు పడ్డందుకు మాత్రం ఆ రాత్రి మేలుకొనే వుందా వీధి!

అర్ధరాత్రి దాటుతుండగా పక్కమీద బరువుగా అనుతూ అనుకుంది సునీత.

"ప్చ్.....సిన్మాకు వెళ్ళేటప్పుడు తాతగార్ని ఇంట్లో వుండమని చెప్పకపోవడం పొరపాటయిందని!"

తమకేదో అడ్డుగా వున్నాడని ఇంట్లో వుండనివ్వకుండా గాలి సాకున బయటకు తరిమిన తమకు తగిన శాస్తే జరిగింది! తనలో బాధపడిపోయాడు శ్రీనివాస్.

"తాతగారూ.... ఏమాశించి రాత్రనకా పగలనకా ఈ రామకోటిని రాసుకుపోతూవుంటారు." రెండు మూడు సార్లు ప్రశ్నించింది గ్రాడ్యుయేట్ మనవరాలు. తను రామకోటిని ప్రారంభించిన రెండేళ్ళకు పుట్టిన పిచ్చిపిల్ల.... గుర్తొచ్చి నవ్వుకున్నారు రాఘవయ్య. □